క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గోవిందరావుపేట: చల్వాయిలోని మోడల్ స్కూల్‌లో గణిత శాస్త్రంలో అధ్యాపకులుగా పని చేయుటకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎండి.నిజామొద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6, 7, 8 తరగతులకు బోధించుటకు ఆసక్తి కలిగి, అర్హతలు కలిగి ఉన్న అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన బయోడేటాతో పాటుగా అన్ని సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలను ఈ నెల 5 సాయంత్రం నాలుగు గంటల లోపు కళాశాలలో సమర్పించాలి అని అన్నారు. బిఎస్సీ, బిఈడి చేసి ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. డెమో, ఇంటర్వ్యూ, విద్యార్హతలు, అనుభవం ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రంలో అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కొప్పుల మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగి అర్హతలు ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలతో కూడిన బయోడేటాతో పాటుగా అన్ని సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలను గురువారం సాయంత్రం నాలుగు గంటల లోపు కళాశాలలో సమర్పించాలి పేర్కొన్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఖాళీగా ఉన్న ఆర్థిక శాస్త్రం, వాణిజ్యశాస్త్రం, జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం, రసాయన శా స్త్రంతో పాటు కంప్యూటర్ సబ్జెక్టలలో బోధించేందు కు అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆ హ్వానిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంట ర్వ్యూ, డెమో క్లాస్ ద్వారా ఎంపిక ఉంటుందని వివరించారు. వివరాలకు సెల్ నంబర్ 7093084347, 9490119483లలో సంప్రదించాలని సూచించారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



గోవిందరావుపేట: పస్రా గ్రామానికి చెందిన కొండి మహేందర్ మూడు నెలల కిందట ద్విచక్రవాహనంపై చల్వాయి వెళ్లి వస్తుండగా మార్గ మధ్యలో ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పస్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను కనిపెట్టి బాధితుడికి మంగళవారం ఎస్సై కమలాకర్ అందజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ములుగు: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి సీతక్క ఎప్పటికప్పుడు జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో మంత్రిపై పార్టీ నాయకులపై తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. ప్రతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్ నాయకులు చేతనైతే సాయం చేయాలని, విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం మానుకోని ప్రజాక్షేత్రంలో తమతో కలిసి రావాలని హితవు పలికారు. కలెక్టర్ నిరంతరం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని అన్నారు. రహదారిపై వందలాది చెట్లు రోడ్లపై కూలితే ఎస్పీ ప్రత్యేక చొరవతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నారని అన్నారు. మంత్రి సీతక్క చొరవతో లోలెవల్ బ్రిడ్జిలు ఉన్న చోట హై లెవల్ బ్రిడ్జి నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించారని త్వరలోనే పనులు జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు సహాయక చర్యల్లో పాల్గొనాలన్నారు.

మిర్చినారుపై గడ్డిమందు పిచికారీ

- రైతుకు రూ.20వేల నష్టం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని కుమ్మరి వీధిలోని ఓ రైతుకు చెందిన మిర్చి నారుపై గుర్తు తెలియన వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. సరికొప్పుల సంపత్‌కు చెందిన మిర్చి నారుపై గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం గడ్డిమందు పిచికారీ చేశారు. సుమారు ఒక ఎకరానికి సరిపోయే నారు నష్టం జరిగింది. దీనివిలువ రూ. 20వేల వరకు ఉంటుందని రైతు వాపోయాడు. చేనులో నాటు వేసుకోవడానికి నారుదిబ్బలను తయారు చేస్తే కావాలని నాపైపగబట్టి ఈ పనిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ఎస్ఎస్ తాడ్వాయి: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి చిరంజీవి



వాజేడు: పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది



వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వీరభద్రవరం, నూగూరు, ఆలుబాక, వీఆర్‌కేపురం, మరికాల గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. గ్రామమస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే వెంకటాపురం ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్, సిబ్బంది మోహన్, జ్యోతి తదితరులు ఉన్నారు.

మంగపేట: మండలంలోని పూరేడుపల్లి, గాంధీనగర్, అకినేపల్లి గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. చుంచుపల్లి వైద్యాధికారి యమున, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో వేర్వేరుగా వైద్య శిబిరాలను నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించి జ్వర పీడితులకు మలేరియా పరీక్షలు నిర్వహించారు. నెగిటీవ్ రిపోర్టు రావడంతో జ్వరాలు తగ్గే వరకు తీసుకోవాల్సిన జాగ్రతలపై సూచనలు చేసి మందులను పంపిణీ చేశారు. అదే విధంగా అకినేపల్లిమల్లారంలో వైరల్ ఫీవర్, దగ్గు, జలుబు, తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 59 మందికి వైద్యాధికారి నిఖిల్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాపించే వ్యాధుల గురించి, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి పీహెచ్‌సీ హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం సారమ్మ, బ్రాహ్మణపల్లి హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం సారమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ జైశ్రీ,, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



మంగపేట: పూరేడుపల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కన్నాయిగూడెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అభినవ్ అన్నారు. మంగళవారం మండలంలోని కన్నాయిగూడెం, చింతగూడెంలో స్థానిక వైద్యులు అభినవ్ సబ్బందితో కలిసి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ రమణకుమారి, ఏఎన్ఎంలు మంజువాణి, లత, ఊర్మిల, సబిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి అడెపు చిరంజీవి అన్నారు. మండలంలోని కామారం(పీటీ), కొండపర్తి, ఇందిరానగర్ గ్రామల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారులు చిరంజీవి, రణధీర్‌లు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల వరదలను దృష్టిలో ఉంచుకుని గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. మూడు గ్రామాల్లో 178 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సూపర్‌వైజర్ సరస్వతి, ఏఎం మంగ, హెల్త్‌అసిస్టెంట్లు జయరాం, తిరుపతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అకినేపల్లిమల్లారంలో..



కన్నాయిగూడెంలో..

జ్వరాలపై ఇంటింటా సర్వే..

వాజేడు: వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో వైద్యాధికారి కొమరం మహేందర్, పల్లె దవఖాన వైద్యాధికారిని గ్యానస ఆధ్వర్యంలో జ్వరాల తీవ్రతపై ఇంటింటా సర్వే నిర్వహించారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. జ్వరం వస్తే తప్పని సరిగా ప్రభుత్వ వైద్యశాలకు రావాలని సూచించారు.

చల్వాయిలోని ఊర కాల్వకు గండ్లు



ఊర కాల్వకు గండి పడి పోతున్న నీరు

గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో రైతులు లక్నవరం సరస్సు నుంచే వచ్చే నర్సింహుల కాల్వ నుంచి వచ్చే నీటి ద్వారా రైతులు పంటలు పండిస్తారు. ఈ కాల్వ చల్వాయి గ్రామంలోకి వచ్చే సరికి మూడు కాల్వలుగా విడిపోయి ఊర కాల్వ, పుట్ల పంపు, గొరారం కాల్వల ద్వారా పంట పొలాలకు నీరు అందుతుంది. ఒక్క ఊర కాలువ కింద సుమారుగా 300 ఎకరాల వరి పంట పండుతుంది. కాగా, భారీ వర్షాలకు చల్వాయి లోని ఊర కాలువకు రెండు చోట్ల గండ్లు పడి, పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీనితో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. నాటు వేసి 40 రోజులు అవుతుందని, ఇప్పటికే ఎకరానికి రూ.20,000 వరకు పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు త్వరగా స్పందించి గండ్లు పూడ్చాలని రైతులు కోరుతున్నారు.



గండి పడడంతో పొలంలో ఇసుక మేటలు

ఎయిడ్స్‌పై ఇంటింటా అవగాహన

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గ్రామంలో మంగళవారం రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై డోర్ టు డోర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ స్కీం సూపర్‌వైజర్ రజిని హాజరై మాట్లాడారు. హెచ్ఐవీ నాలుగు మార్గాల ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషితమైన సూదులు, ఇంజక్షన్ల వల్ల, పరీక్షించని రక్త మార్పిడి, హెచ్ఐవీ ఉన్న తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకు ఎయిడ్స్ వస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఒకవేళ హెచ్ఐవీ గర్భిణి ఉంటే పుట్టబోయే బిడ్డకి హెచ్ఐవీ రాకుండా మందులు ఉన్నాయని తెలిపారు. హెచ్ఐవీ బాధితులను ప్రేమతో ఆదరించాలని సూచించారు. వారిపై వివక్ష చూపితే రూ.5వేల జరిమానా, మూడు నెలల వరకు బెయిల్ దొరకని శిక్ష ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరోజన, ఆశ వర్కర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న వర్కర్స్ స్కీం సంస్థ ప్రతినిధులు

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని గిరిజన భూమిపుత్ర సంఘం నూతనంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం స్థానిక ఎస్సై తాజొద్దీన్‌ను కలిసి సన్మానించారు. సంఘం స్థితిగతులు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గండెపల్లి సత్యం, ఉపాధ్యక్షుడు జగన్నాథం నాగసాగర్, ఈక మహాలక్ష్మి, సుల్తాన్ లావణ్య, తెల్లం నాగమణి, పలకగంగా, పులిసె రాధిక, సునావత్ భరత్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రాకు చెందిన కంచర్ల లక్ష్మీనారాయణ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. దీంతో అతడితో కలిసి 1988–89వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న తోటి స్నేహితులు లక్ష్మీనారాయణకు రూ.50,000ల ఆర్థిక సాయం అందజేశారు. మిత్రులు కరుణాకర్ రెడ్డి, సమ్మిరెడ్డి, రవీంద్ర చారి, శ్రీనివాస్ గౌడ్, సుధాకర్ రెడ్డి, వెంకన్న, నరేందర్, అయోధ్య, హైమ, వాణి, విజయ, సాంబశివరావు, సోమి రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న నాగజ్యోతి

ఏటూరునాగారం: మండలంలోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన తీగల చంద్రయ్య, తాటిపెల్లి సురేష్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మంగళవారం పరామర్శించారు. ఒక్కోక్క కుటుంబానికి రూ.3వేలు ఆర్థిక సాయం చేశారు. సప్పిడి రాంనర్సయ్య, తుమ్మ మల్లారెడ్డి, సునీల్‌కుమార్, కూనూరు అశోక్, మాదరి రామయ్య, రామ్మూర్తి, రామకృష్ణ పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని రైతుల ధర్నా



బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న పొట్లాపూర్ రైతులు

ములుగు రూరల్: బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ వర్తించలేదని ఆరోపిస్తూ జిల్లా కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఎదుట రైతులు మంగళవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని పొట్లాపూర్ గ్రామంలో 180 నుంచి 200 మంది రైతులకు కెనరా బ్యాంక్ ద్వారా పంట రుణాలు తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన సందర్భంగా గ్రామంలో కేవలం 60 నుంచి 70 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ పథకం వర్తించిందని తెలిపారు. మిగిలిన రైతులకు రుణమాఫీ ఎందుకు వర్తించలేదని అధికారులను సంప్రదించగా కటాఫ్ తేదీ కంటే ముందు రుణాలు తీసుకున్న కారణంగా రుణమాఫీ వర్తించలేదని తెలిపారు. కటాఫ్ తేదీ కంటే ముందే రుణం తీసుకున్నట్లుగా బ్యాంక్ రికార్డులల్లో చూపిస్తుందని తెలిపారు. దీంతో తమకు రుణమాఫీ వర్తించకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైతు గ్రీవెన్స్ సెల్‌లో పొట్లాపూర్ రైతులంతా ఫిర్యాదు చేయగా వ్యవసాయ శాఖ అధికారులు రుణమాఫీ వర్తించని రైతులంతా దరఖాస్తులు ఇవ్వాలని సూచించడంతో బ్యాంక్ ఎదుట రైతులు ధర్నా విరమించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఎంహెచ్ఓ, మండల స్పెషలాఫీసర్ అల్లెం అప్పయ్య అన్నారు. మండలంలోని ఎల్బాక, పడిగాపూర్ గ్రామాలను మంగళవారం తహసీల్దార్ రవీందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిలతో కలిసి సందర్శించారు. గ్రామస్తులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. వరదల వలన ఏర్పడిన ఇబ్బందులను గ్రామస్తులు అధికారులకు వివరించారు. గ్రామాల చుట్టూ వరదల వలన రవాణా సౌకర్యం లేకపోవడంతో నిత్యావసర సరుకులు, కానీ అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కొంగలమడుగు బ్యాక్ వాటర్ రోడ్డుపైకి రావడం వలన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈజీఎస్ డబ్బులు బీపీఎం సరిగా ఇవ్వడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అల్లెం అప్పయ్య మాట్లాడుతూ.. ఇటీవలన మంత్రి సీతక్క వచ్చిన సందర్భంగా జంపన్నవాగుపై బ్రిడ్జి మంజూరు అయిందని స్వయంగా ప్రకటించినట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. కొంగలమడుగు బ్యాక్ వాటర్‌ను తొలగిస్తామన్నారు. గ్రామంలోని సమస్యలన్నింటిని పరిష్కారిస్తామన్నారు. అనంతరం కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 237 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. ఎంపీఓ శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్‌తో పాటు తదితరులు గ్రామస్తులు ఉన్నారు

రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



పరామర్శిస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలో కాల్వపల్లి, నార్లాపూర్ గ్రామాల్లోని మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సరిగొండ బలరాంనాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని నార్లాపూర్ పడుగు పడి మృతి చెందిన పుట్ట మహేశ్, కాల్వపల్లి గ్రామంలో వాగు వరదలో పడి మృతి చెందిన పశుల కాపరి మల్లికార్జున్ కుటుంబాలను ఆయన పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు భర్తపురం నరేష్, శ్రీమంతుల రవీంద్రచారి, నియోజకవర్గ కన్వీనర్ జాడి వెంకట్, ఉపాధ్యక్షులు జినుకల కృష్ణాకర్, రవీందర్ రెడ్డి, మండల సభ్యత్వ నమోదు కన్వీనర్ డ్యాగల సలేందర్, మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి లక్ష్మణ్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాదరి శ్రీకాంత్, నాయకులు ఆలెంశ్రీను, మొక్క నరేష్, దేవ్ సింగ్, నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న జంపయ్య

ఏటూరునాగారం: జిల్లాలోని వరద ముంపు గ్రామాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జిల్లా బీఆర్‌ఎస్ నాయకుడు భూక్య జంపయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కొండాయి, మల్యాల, ఐలాపురం ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించి గ్రామస్తులకు కావాల్సిన సరుకులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కొండాయి బ్రిడ్జి శంకుస్థాపన చేశారు గానీ ఎలాంటి నిర్మాణాలను చేపట్టలేదన్నారు. జ్వరం వస్తే చికిత్సల కోసం పడవలో ప్రయాణించాల్సిన దుస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, గణేష్‌రెడ్డి, ఎంపెల్లి రాజు, సర్వేశ్వర్, శ్యామ్, రవి, కిషోర్ పాల్గొన్నారు.

జంపన్నవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం



మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: ఎల్బాక జంపన్నావాగుపై మంత్రి సీతక్క కృషితో త్వరలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి సీతక్క వదరల వలన ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు చేశారని తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్ అధికారంలో పని చేసిన మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎల్బాక వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంపై గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్మాణానికి ఎందుకు కృషి చేయలేదని ప్రశ్నించారు. బ్రిడ్జి నిర్మించాని సీతక్క ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గత ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండి ముజఫర్‌హుస్సేన్, మాజీ ఎంపీపీ మొగిలిపల్లి రవి, సింగల్ విండో డైరెక్టర్లు యానాల సిద్దిరెడ్డి, జగన్, జిల్లా నాయకులు తాండాల శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు బండారి చంద్రయ్య, శనిగరపు చిరంజీవి, ఆలేటి జైపాల్ రెడ్డి, గంట సాయి రెడ్డి, పిట్టల మహేందర్, భూపతి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ఏటూరునాగారం: లోతట్టు ప్రాంతాల ప్రజలు అధైర్యపడకుండా ఉండాలని అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మండలంలోని రామన్నగూడెం గోదావరి పరివాహక ప్రాంతాలను పార్టీ నాయకుతో కలిసి రఘు మంగళవారం పరిశీలించారు. కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలకు ఎప్పటికప్పుడు సహాయక చర్యలు తీసుకుంటుమని, అధికారులను అప్రమత్తం అయ్యేలాగా చూస్తామన్నారు. ప్రతి ఒక్కరు స్వీయ రక్షణ పాటించాలని, ప్రమాదం పొంచి ఉన్న చోట ముందస్తు సమాచారం అందిస్తే పునరావాస కేంద్రాలకు తరలిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరు బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ పాషా ఉన్నారు.